రంజాన్ వేళలు | ఇఫ్తార్ (మంగళ) సా.6.24 | సహరి (బుధ) ఉ.4.42

కుంగిన గామన్ బ్రిడ్జి
- వాహన రాకపోకలు నిలుపుదల
- వంతెనను పరిశీలించిన ఆర్డీసీ అధికారులు

- 5లో



అటు జోరు ఇటు బేజారు

- జిల్లాలో ఊపందుకున్న అసెంబ్లీ ఎన్నికల వేడి
- ఎట్టకేలకు టీడీపీ కూటమి, వైసీపీ అభ్యర్థుల ఎంపిక ప్రహసనం పూర్తి
- రకరకాల సర్వేలు, వడపోతలు, బేరీజుల తర్వాత నేతల పేర్లు వెల్లడి
- ఎన్నికల బరిలో ప్రచారం ముమ్మరం చేసిన ఇరు పార్టీల అభ్యర్థులు
- సూపర్‌సిక్స్ పథకాలు, అధికారపార్టీ అరాచకాలపై టీడీపీ, జనసేన ప్రచారం
- కేవలం ప్రలోభాలు, విందులు, వినోదాలతో వైసీపీ అభ్యర్థుల అడ్డదార్లు
- ఒకపక్క వలంటీర్లు, మరోపక్క కీలక కార్యకర్తలకు డబ్బులు, గిఫ్ట్‌ల పంపకాలు
- గడపగడపకు ప్రచారంలో జనం తిరగబడుతుండడంతో ఓటమి గుబులు
- ఇప్పటికే సమస్యలపై ప్రత్తిపాడు, కాకినాడ సిటీ వైసీపీ అభ్యర్థులకు చుక్కెదురు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంది. ఎట్టకేలకు అభ్యర్థుల ఎంపిక పూర్తవడంతో టీడీపీ కూటమి, అధికార వైసీపీ అభ్యర్థులు ఎన్నికల రణక్షేత్రంలో ప్రచారహోరు పెంచారు. రోజూ ఉదయం, రాత్రి ఇంటింటా ప్రచారం స్పీడు పెంచారు. అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ జిల్లాలో దాదాపు నాలుగునెలలపాటు సాగింది. అభ్యర్థుల సామర్థ్యాలు, గెలుపోటముల లెక్కలు, సామాజిక సమతూకాల కసరత్తుతో కొన్నినెలలపాటు టీడీపీ, జనసేన కూటమి, వైసీపీ అభ్యర్థుల ఎంపిక సుదీర్ఘంగా సాగింది. ఎట్టకేలకు జిల్లాలో ఏడు స్థానాలపై ఇరుపార్టీలు తమ అభ్యర్థుల ప్రకటన పూర్తి చేశాయి. ఏ నియోజకవర్గంనుంచి ఎవరు బరిలో ఉంటాయో ప్రకటించేశాయి. ఎన్నికల షెడ్యూల్ కూడా రావడంతో ఇప్పుడు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, వైసీపీ అభ్యర్థులు ముమ్మర ప్రచారం మొదలుపెట్టారు. పార్టీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు, మరోపక్క అధికార వైసీపీ అక్రమా లు, అరాచకాలు, ప్రజలను వేధింపులకు గురిచేసిన తీరును ఓటర్లకు టీడీపీ, జనసేన అభ్యర్థులు వివరిస్తూ ఇంటింటా తిరుగుతున్నారు. వైసీపీ అభ్యర్థులేమో ఈ ఐదేళ్లలో తమ ప్రభుత్వం చేసిందేంటో చెప్ప లేక బిక్కుబిక్కుమంటూ గడపగడపకు వెళ్తున్నారు. ఎవరు ఏ సమస్య పై నిలదీస్తారో తెలియక ఉలిక్కిపడుతూనే ప్రచారం చేస్తున్నారు. దీం తో ప్రచారంకంటే ప్రలోభాలనేనమ్ముకుని అడ్డదారులు తొక్కుతున్నారు.


వైఫల్యాలను వివరిస్తూ.. చేయబోయేది చెబుతూ..

ఇంతకాలం ఎవరికి ఎక్కడ సీటు వస్తుందో.. తమ జాతకాలు ఏం టో తెలియక.. సీట్ల ఎంపికలో తమకు చోటుంటుందా.. లేదా.. అనే డైలమాతో టీడీపీ కూటమి, వైసీపీ ఎమ్మెల్యే టికెట్ ఆశావహులు డైల మాలో కొట్టుమిట్టాడారు. ప్రధానంగా రాజకీయంగా కాకినాడ జిల్లా అన్ని పార్టీలకు అత్యంత కీలకం కావడంతో ఇతర జిల్లాలతో పోల్చితే ఇక్కడ టీడీపీ, జనసేన కూటమి, అధికార వైసీపీ అభ్యర్థుల ఎంపికలో చాలా జాప్యం జరిగింది. సగానికిపైగా సీట్లలో అభ్యర్థులను వెల్లడించ డానికి ఆయా పార్టీలు నానాపాట్లు పడ్డాయి. అభ్యర్థుల బలాబలాల బేరీజు దగ్గరనుంచి గెలిచే సామర్థ్యం ఉందా? లేదా? సామాజిక సమీక రణాల అంచనాలకు సరిపోతారా లేదా అనేదానిపై తీవ్ర కసరత్తు చేశాయి. ప్రధానంగా జనసేన పార్టీ కాకినాడ పార్లమెంట్ పరిధిలో పిఠాపురం అసెంబ్లీ, కాకినాడ ఎంపీ స్థానాన్ని దక్కించుకుంది. కానీ వీటిలో ఎవరు బరిలో నిలబడతారనేదానిపై చాలాకాలం స్పష్టత రాలే దు. సుదీర్ఘ సస్పెన్స్ తర్వాత జనసేన అధినేత పవన్ ఈ రెండు స్థానా ల గుట్టు విప్పారు. పిఠాపురంలో తాను, ఎంపీ స్థానంనుంచి టీ టైం అధినేత ఉదయ్ పోటీచేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో జనసేన స్థా నాలపై స్పష్టత వచ్చింది. ఆ తర్వాత కాకినాడ సిటీలో వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడిని ఢీకొట్టే నేతకోసం చాలా లెక్కలు వేసిన టీడీపీ సిటీ అభ్యర్థి ఎంపికను అదేపనిగా వాయిదా వేసింది. చివరకు అనేక లెక్కల తర్వాత తిరిగి ప్రస్తుత ఇన్‌చార్జి కొండబాబుకే సీటు ఖాయం చేసింది. అటు వైసీపీ సైతం ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట స్థానాలను మి నహా మిగిలిన సీట్లపై చాలాకాలం దోబూచులాడింది. జగ్గంపేట, పెద్దా పురం అభ్యర్థులు మారుతారని సంకేతాలు పంపింది. ఎట్టకేలకు ఎంపి క ప్రక్రియ పూర్తిచేసి అభ్యర్థులను ప్రకటించింది. దీంతో జిల్లాలో టీడీపీ కూటమి, వైసీపీ అభ్యర్థులు ఎవరనేదానిపై పూర్తిగా స్పష్టత వచ్చేసింది. ఈ నేపథ్యంలో కొన్నిరోజులుగా టీడీపీ, జనసేన అభ్యర్థులు నియోజకవర్గాల్లో ప్రచారం ముమ్మరం చేశారు. పెద్దాపురంలో ఎమ్మెల్యే అభ్యర్థి రాజప్ప ఇంటింటా ప్రచారం స్పీడు పెంచారు. ఉదయం, రాత్రి వేళల్లో ప్రజలను కలుస్తూ టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తు న్నారు. జగ్గంపేటలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సోమవారం ఎన్నికల ప్రచార రథంపై ఇంటింటి ప్రచారం మొదలుపెట్టారు. కాకి నాడ రూరల్‌నుంచి జనసేన అభ్యర్థి పంతం నానాజీ, ప్రత్తిపాడునుం చి వరుపుల సత్యప్రభ, తునిలో యనమల దివ్య, కాకినాడ సిటీ నుంచి కొండబాబు ప్రచార హోరు పెంచారు. వీరంతా జనసేన, బీజేపీ నేత లు, క్యాడర్‌తో కలిసి ఒకరికొకరు సహకరించుకుంటూ టీడీపీ ప్రకటిం చిన సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతిఒక్క కుటుంబం ఆర్థికంగా ఎంత లబ్ధి పొందబోతోందో ప్రజలకు వివరిస్తున్నారు. అదే సమయంలో ఐదే ళ్ల వైసీపీ పాలన ప్రజలకు ఎంత నరకప్రాయంగా మారిందో వివరిస్తు న్నారు. పన్నుల వాత, ఛార్జీలమోత, సంక్షేమ పథకాల కోత.. ఇలా అనే క రకాల వైసీపీ అక్రమాలు, అరాచకాలు, దౌర్జన్యాలను వివరిస్తూ ప్ర చారం స్పీడు పెంచారు. ప్రజలనుంచి ఈసారి టీడీపీ కూటమికే తమ ఓటుఅంటూ మద్దతు లభిస్తుండడంతో టీడీపీ అభ్యర్థుల్లో గెలుపు ధీమా కనిపిస్తోంది. మూడుపార్టీలనుంచి నేతలు, కార్యకర్తలు ఉమ్మడి అభ్యర్థితో ప్రచారం చేస్తుండడంతో ఎక్కడికక్కడ ప్రచారం హోరెత్తుతోం ది. కూటమి పేరు మార్మోగుతోంది. పిఠాపురంనుంచి జనసేన అభ్యర్థి పవన్ ఒకటి, రెండురోజుల్లో ప్రచారం ప్రారంభించనున్నారు. తద్వారా టీడీపీ కూటమికి ప్రజల్లో మరింత గ్రాఫ్ పెరగడం ఖాయమని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు.

ఏమీ చెప్పలేక.. బిక్కుబిక్కుగా..

అధికార వైసీపీ అభ్యర్థులు జిల్లాలో బిక్కుబిక్కుమంటూ ప్రచారం మొదలుపె ట్టారు. ఐదేళ్ల పాలనలో ప్రజలకు జగన్ సర్కారు చేసిందే లేకపోవడంతో ఓటర్లకు ఏం చెప్పాలో కూడా ఆ పార్టీ అభ్యర్థులకు అర్థంకావడం లేదు. వాస్తవానికి జగన్ పా లనలో జిల్లాలో సంక్షేమ పథకాల్లో కోత ల తో లబ్ధిదారులను కుదించేయడంతో వారం తా ఆగ్రహంగా ఉన్నారు. అభివృద్ధి పిసరంతైనా లేకపోవడం, ఇంటి పన్ను, చెత్తపన్నుల పెంపు, విద్యుత్, బస్సు ఛార్జీల పెంపు, ఇళ్లస్థలాలు పూర్తిగా ఇవ్వలేకపోవడం, ఇచ్చిన చోట లేఅవుట్ల దారుణ దుస్థితి, ఇళ్లు కట్టుకున్న వారికి బిల్లులు అందకపోవడం ఇలా ఒకటేంటి వైసీపీ ప్ర భుత్వ వైఫల్యాల జాబితా చాంతాడంత ఉండడంతో ఎక్కడికక్కడ ప్రజ లు ఏదొక అంశంపై తమను నిలదీస్తుండడంతో వైసీపీ అభ్యర్థులు బెం బేలెత్తుతున్నారు. ఓటు వేయాలంటూ ఇంటింటికి వెళ్తుంటే ఎవరు ఎటువైపునుంచి వచ్చిన నిలదీసి పరువు తీసేస్తారేమోనని జంకుతు న్నారు. ఇటీవల కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి ఏటిమొగ నుంచి తొలిరోజు ప్రచారం ప్రారంభించగా, ఇన్నాళ్లకు తమ ప్రాంతం గుర్తొచ్చిందా.. అసలు మీ ప్రభుత్వం ఏంచేసింది.. చెత్తపన్నుతో వేధిస్తా రా.. అంటూ మహిళలు తిట్ల దండకం అందుకోవడంతో ద్వారంపూడి మొహం మాడిపోయింది. ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సుబ్బారావును సైతం రహదారులు వేయడం చేతకాదు కానీ.. ఓటెందుకు అడుగుతా రు అంటూ జనం తిరగబడ్డారు. ఇలా అనేకచోట్ల నిరసనలు, నిలదీత లు ఎదురవుతుండడంతో వైసీపీ అభ్యర్థులు ప్రచారంలో నానా తంటా లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జనం నుంచి ఓట్లు ఎలాగూ పడవ నే భయంతో వైసీపీ అభ్యర్థులు భారీగా ప్రలోభాలను ఆశ్రయిస్తున్నా రు. నియోజకవర్గాల్లో వలంటీర్లతో రహస్య సమావేశాలు నిర్వహించి డబ్బులు, గిఫ్ట్‌లు ఇస్తూ తమ కోసం ప్రచారం చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. తాము ప్రజల్లోకి వెళ్తే తిరగబడుతున్నారని, అందుకే వలం టీర్లే తమను గెలిపించాలంటూ వారిని రహస్యంగా వాడుకుంటున్నారు. గ్రామాల్లో ప్రజావ్యతిరేకతను తప్పించుకోవడంకోసం స్థానిక కీలక నా యకులు, గ్రామపెద్దలకు విందులు, వినోదాలు ఆఫర్ చేస్తూ వారిని మచ్చిక చేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. టీడీపీ, జన సేన అభ్యర్థులు జరగబోయే మేలువివరిస్తూ ప్రచారం చేస్తుంటే వైసీపీ అభ్యర్థులు ప్రజా వ్యతిరేకత భయంతో అడ్డదార్లలో పయనిస్తున్నారు.

పిఠాపురం నుంచి పవన్‌కల్యాణ్
ఎన్నికల శంఖారావం



- 30నుంచి ప్రచారం ప్రారంభం
- మూడురోజులపాటు ఇక్కడే బస
- ఉగాది వేడుకల్లో పాల్గొంటానని వెల్లడి

- 5లో

ఎన్నికల ప్రచార అనుమతికి..
సువిధ యాప్

- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 25: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచార అనుమతి కోసం సువిధ యాప్ వినియోగించాలని కలెక్టర్ కృతికాశుక్లా సూచించారు. సోమవారం ఒక ప్రకటన వెలువరించారు. దీనికి నేరుగా రిటర్నింగ్ అధికారికిగానీ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికిగానీ దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. వాహనాల అనుమతికి సంబంధించిన దరఖాస్తుతోపాటు వాహనాల రిజిస్ట్రేషన్ వివరాలు, డ్రైవింగ్ లైసెన్సు, వాహన యజమాని పేరు, డ్రైవర్ పేరు, చిరునామా, మొబైల్ నెంబరు విధిగా రాయాలన్నారు. వాహనం సంచరించే ప్రాంతం, రూట్ మ్యాప్ తప్పనిసరిగా ప్రస్తాయించాలన్నారు. మోటారు వాహన తనిఖీ అధికారినుంచి తనిఖీ సర్టిఫికెట్ పొందాలన్నారు. ర్యాలీలు, రోడ్డు షో వంటి కార్యక్రమాలకు రూట్‌మ్యాప్, ర్యాలీలో పాల్గొనే వారి సంఖ్య పొందుపర్చాలన్నారు. బహిరంగ సభల జరిగే తరుణంలో హెలీప్యాడ్ కోసం తన అనుమతి తీసుకోవాలన్నారు. సువిధ యాప్ కోసం పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సువిధా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. సువిధా పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు వీలైనంత తొందరగా అనుమతులు లభిస్తాయన్నారు. సువిధ యాప్ ద్వారా 19 రకాల అనుమతులు జారీ చేస్తామన్నారు. ఇంటిపై బ్యానర్లు, స్టిక్కర్లు అతికించాలంటే ఆ ఇంటి యాజమాని అనుమతి ఉండాలన్నారు. తాత్కాలిక ఎన్నికల కార్యాలయం ఏర్పాటుకు భవన యాజమాని అనుమతి, అద్దె వివరాల, ఇతర అంచనా వ్యయంలతో కూడిన దరఖాస్తు చేయాలన్నారు. ఎలాంటి అనుమతికైనా 48 గంటల ముందు దరఖాస్తు చేయాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రచార కార్యక్రమాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

దేవదాయ అర్చకులపై వైసీపీ నేత, మాజీ కార్పొరేటర్ దాడి
- కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

- మెయిన్‌లో

సంధ్య ఆక్వా బస్సు కంపెనీకి అప్పగింతపై అనుమానాలు
- పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లపోవడంతో పోలీసుల వైఖరిపై విమర్శలు

- మెయిన్‌లో

అడ్డగోలుగా తవ్వకాలు

- సి.రాయవరంలో నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువు తవ్వకాలు
- అంతా అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే..
- పట్టించుకోని అధికారులు



ఏలేశ్వరం మండలం సి.రాయవరంలో సాగుతున్న చెరువుల తవ్వకాలు

ఏలేశ్వరం, మార్చి 25: ఏలేశ్వరం మండలంలోని సి.రాయవరంలో ఏలేరు రిజర్వాయర్‌ను ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా చేపలు, రొయ్యల చెరువు ల తవ్వకాలు చేపడుతున్నారు. చెరువుల తవ్వకాల్లో నిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. అధికార యంత్రాంగం డబ్బుకు దాసోహం అవుతోం ది. వైసీపీ నాయకులు తలచుకుంటే ఎక్కడైనా చెరువుకు అనుమతి లభిస్తోంది. మండలంలోని తూర్పులక్ష్మీపురం, రమణయ్యపేట, జె.అన్నవరంల్లో నిబంధన లకు విరుద్ధంగా చెరువు తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. సి.రాయవరంలో 18 ఎకరాల్లో ఇద్దరు రైతులు విక్రయించిన భూమిలో మండపేటకు చెందిన వ్యక్తి చెరువు తవ్వకం పనులు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదు.

అనుమతి ఎలా ఇచ్చారు?

చేపల చెరువు తవ్వుతున్న ప్రాంతానికి అతి దగ్గర్లో ఏలేరులో నీటిని శుభ్రం చేసి ప్రజలకు మంచినీరు అందించే ఫిల్టర్ బెడ్ ఉంది. ఇక్కడ అనుమతి ఎలా ఇచ్చారో ప్రశ్నార్థకంగా ఉంది. చేపల చెరువుతో తాగునీరు కలుషితమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సమీపానే ఉన్న వ్యవసాయ భూములు పాడయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతు న్నారు. భూగర్భంలోని నీరు పాడై సి.రాయవరం గ్రామానికి మంచి నీటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఎక్కువగా ఉంది.

చెరువుల తవ్వకాలవల్ల చుట్టుపక్కల ఉన్న తమ పంట పొలాలు దెబ్బతిం టాయని ఫిల్టర్ బెడ్ సమీపానే చేపల చెరువు అనుమతి ఎవరిచ్చారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి విచారణ చేసి అనుమతి రద్దు చేయాలని కోరుతున్నారు. చెరువల తవ్వకాలకు అనుమతి ఉందో లేదో తెలియదని, తన దగ్గర ఏ సమాచారం లేదని మత్స్యశాఖ ఇన్స్పెక్టర్ రాజేంద్ర స్పష్టం చేశారు.

కబ్జాదారుల కోరల్లో జగ్గమ్మ చెరువు

- హైవేను ఆనుకుని ఉండడంతో పలు నాయకుల కన్ను

గండేపల్లి, మార్చి 25: గండేపల్లి మండలంలో నీలాద్రిపేట గ్రామ పంచా యతీ పరిధిలో ఉన్న జగ్గమ్మ చెరువుపై కొందరి నాయకులు కన్ను పడి రో జూ కబ్జాకు గురవుతోంది. ఈ చెరువు ఇటు నీలాద్రిపేట జాతీయ రహదారి, జగ్గంపేట పట్టణం గోకవరం వెళ్లే రహదారిని ఆనుకుని ఉండడంతో ఈ చెరు వును కబ్జా చేసేందుకు పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ ప్రాంతంలో స్థలాల ధరలు అధికంగా ఉన్నాయి. సెంటు రూ.8లక్షల నుంచి రూ.10లక్షల వరకు పలుకుతోంది. దీంతో ఈ చెరువును ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆ చెరువు గట్టు చుట్టూ పలు నిర్మాణాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, హోటల్స్ ఉన్నాయి. వాటి నిర్మాణాల్లో ఈ చెరువు స్థలం ఉండవచ్చని పలువురు అంటున్నారు. ముందుగా కబ్జాదారులు చెరువును కొంతమేర చదును చేసి ఆ ప్రాంతంలో తాత్కాలికంగా బడ్డీకొట్టులు, చిన్ని చిన్న పూరిపాకలు వేసి కొంతకాలం వాటిని అలా ఉంచి నెమ్మది నెమ్మదిగా ఆక్రమించి చుట్టూ బలమైన కంచెలు చేసుకుని నిర్మాణాలు చేసి స్వాధీనం చేసుకుంటున్నారు. మరికొంతమంది అధికారుల సహకారంతో నకిలీ పత్రాలు పుట్టించి విక్రయాలు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. మరి కొందరు వారికి ఉన్న కొద్దిపాటి స్థలానికి చెరువు కలుపుకుని ఆక్రమించుకుం టున్నారని పలువురు అంటున్నారు. ఈ చెరువు విస్తీర్ణం 23 ఎకరాలు ప్రస్తుతం 15 ఎకరాలు కూడా ఉండే పరిస్థితి లేదని మిగతా అంతా కబ్జాకు గురైందంటున్నారు. ఈ చెరువు 125 ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ ఈ చెరువునుంచి నీరు వెళ్లే కాలువలన్నీ కబ్జాలు గురై కట్టడాలు కట్టారని ఇప్పుడు లక్షల్లో ఉంటాయని పలువురు చెబుతున్నారు. ఇంతలా కబ్జా జరుగు తున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కబ్జాదారుల కోరల్లో ఉన్న జగ్గమ్మ చెరువును వెలికితీయాలని పలువురు కోరుతున్నారు.



గండేపల్లి మండలం నీలాద్రిపేట గ్రామ శివారులో ఉన్న జగ్గమ్మ చెరువు

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

- యానాం-కాకినాడ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



యానాం-కాకినాడ సరిహద్దు చెక్‌పోస్టువద్ద పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్పీ

కాకినాడ క్రైం, మార్చి 25: రానున్న ఎన్ని కల నేపథ్యంలో యానాం-కాకినాడ జిల్లా సరి హద్దు చెక్‌పోస్టులవద్ద అప్రమత్తంగా ఉంటూ నిరంతర తనిఖీలు చేపట్టాల్సిందిగా ఎస్పీ సతీ ష్‌కుమార్ ఆదేశించారు. యానాం-కాకినాడ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులను సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యం లో అక్రమ నగదు, మద్యం రవాణాకు పాల్ప డే అవకాశాలు ఉన్నాయని, యానాం, జిల్లా పోలీసులు పటిష్ఠ సమాచార వ్యవస్థతో పోలీ సులు, ఎస్ఈబీల సమన్వయంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రతి వా హనాలను సమగ్రంగా తనిఖీలు చేపట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వస్తువులు, నగదును సీజ్ చేయాలని ఆదే శించారు. ఇరురాష్ట్రాల సరిహద్దు వైపు పది చెక్ పోస్టులను ఏర్పాటు చేసేలా యానాం ఎస్పీతో చర్చించి, నిర్ణయం తీసు కున్నామన్నారు. ఈ సందర్భంగా మల్లవరం, సుంకరపాలెం, అరటికాయలంక చెక్‌పోస్టులను తనిఖీ చేశారు.

కాకినాడ జిల్లాలో నఖ బందీ కార్యక్రమం

కాకినాడ క్రైం, మార్చి 25: రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం కాకినాడ జిల్లావ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో నఖ బందీ కార్యక్రమం చేపట్టారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ముఖ్యమైన సెంటర్లు, ప్ర ధాన రహదారులవద్ద పెద్దఎత్తున పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అక్రమంగా నగదు, మద్యం రవాణాతోపాటు మాదకద్రవ్యాలు, చోరీచేసిన వాహనాలు, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలపై దృష్టిసారించి తనిఖీ లను నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీలక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్ల పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడ సాగరతీరంలో ఇండో-యుఎస్ఏ నావికాదళ విన్యాసాలు

- నేటినుంచి నుంచి 31 వరకు టైగర్ ట్రంప్
- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ సతీష్‌కుమార్

- 5లో



సూర్యారావుపేట బీచ్‌లో ఇండో-యుఎస్ఏ విన్యా సాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

28 నుంచి ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలు

- కిర్లంపూడిలో ముగిసిన శిక్షణ
- ఆంధ్రప్రదేశ్ జట్టు ఎంపిక

- 5లో

ఫెన్సింగ్‌లో నైపుణ్యాలు సాధించాలి

- రాజానగరం జీఎస్ఎల్‌లో జాతీయ సబ్ జూనియర్ ఫెన్సింగ్ పోటీలు
- 29 రాష్ట్రాల నుంచి పోటీలకు వచ్చిన క్రీడాకారులు

- 5లో

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

- జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి
- కంట్రోల్ రూమ్‌కి కాల్ చేయాలి
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

సర్పవరం జంక్షన్, మార్చి 25: ప్రభుత్వ మద్యం దుకాణాలు, వాకిన్ స్టోర్స్‌ల్లో ఎమ్మార్పీకే మద్యం విక్ర యాలు జరుగుతున్నాయని, నిబంధనలు ఉల్లంఘించి విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె.వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వాకిన్ లిక్కర్ స్టోర్‌ల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తూ 'నిబంధనలు బేఖాతర్' పేరిట ఆం ధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పం దించారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు, వాకిన్ లిక్కర్ స్టోర్‌ల్లో నిర్ధారించిన సమయాల్లోనే మద్యం విక్రయాలు నిర్వహించాల్సి ఉందన్నారు. అలా కాదని నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయాలు, ఎమ్మార్పీ కంటే అద నపు వసూళ్లకు పాల్పడినా, నిర్ధారించిన సమయాన్ని మించి విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే తమ కంట్రో ల్‌రూమ్ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరా రు. నిబంధనల ఉల్లంఘనపై కంట్రోల్ రూమ్‌నెంబర్ 0884-2376227కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

ఎలా జరిగింది?

- గామన్ బ్రిడ్జిపై వాహన రాకపోకలు నిలుపుదల
- వంతెనను పరిశీలించిన ఆర్డీసీ అధికారులు


గామన్ వంతెనపై కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీసీ సిబ్బంది


కొవ్వూరు, మార్చి 25: కొవ్వూరు-రాజమహేంద్రవరం మధ్య అఖండ గౌతమీ గోదావరినదిపై ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ నిర్మించిన నాలుగులైన్ల గ్రామన్ వంతెన కుంగింది. దీంతో వంతెనపై కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలో వాహనరాకపోకలను రెండోరోజు పూర్తిగా నిలుపుదల చేశారు. రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వైపు వచ్చే మార్గంలో మాత్రమే రెండు వైపులా వాహన రాకపోకలను అనుమతిస్తున్నారు. బ్రిడ్జిపై కుంగిన ప్రాంతాన్ని రోడ్డు డెవలప్‌మెంటు కార్పొరేషన్(ఆర్డీసీ) అధికారులు సోమవారం పరిశీలించారు. వంతెనపై 50 నుంచి 53వ స్తంభం వరకు అధికారుల బృందం పరిశీలించింది. వాహనాల రాకపోకల సమయంలో వైబ్రేషన్ అధికంగా రావడాన్ని గమనించిన గామన్ బ్రిడ్జి టోల్‌గేట్ నిర్వహణ సిబ్బంది ముందస్తు జాగ్రత్త చర్యగా ఆదివారం సాయంత్రం నుంచి వంతెనపై మరమ్మతులకు గురైన మార్గంలో పూర్తిగా రాకపోకలు నిలుపుదల చేశారు. ఆర్డీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీకాంత్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బీపీ వర్మ, కొవ్వూరు సీఐ వి.జగదీశ్వరరావు కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. వంతెనపై నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు రాకపోకలు సాగించడం, వంతెన చెంతనే భారీ యంత్రాలతో ఇసుక డ్రెడ్జింగ్ చేపట్టడంతో వంతెనలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇప్పటికే కొవ్వూరు-రాజమహేంద్రవరం పాత రైలు వంతెన (హేవ్‌లాక్ బ్రిడ్జి)ను మూసివేశారు. ఆసియాలోనే పొడవైన వంతెనలలో రెండోదిగా పేరుగాంచిన రోడ్డు కం రైలు వంతెన దీనస్థితికి చేరుకుంది. వంతెనకు ఇటీవల తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కేవలం కార్లు, ద్విచక్ర వాహనాలు, పల్లెవెలుగు ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులకు మాత్రమే రాకపోకలు సాగించేలా అనుమతులు ఇచ్చారు. భారీ వాహనాలతోపాటు, ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నిలుపుదల చేస్తూ ఆంక్షలు విధించారు. మూడు, నాలుగో బ్రిడ్జిలు ఆర్చ్ ఆకారంలో ఉన్న రైలు వంతెన(గామన్ వంతెనలు) గామన్ వంతెనను 2007లో సుమారు రూ.808 కోట్లతో నిర్మాణం ప్రారంభించారు. 2015 గోదావరి మహా పుష్కరాల సమయంలో కొవ్వూరు, రాజమహేంద్రవరంలకు గోదావరి పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా అప్పటి ప్రభుత్వం హడావుడిగా వంతెనపై రాకపోకలను ప్రారంభించింది. అప్పటి నుంచి రోజుకు సగటున 20 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు కం రైలు బ్రిడ్జిపై భారీ వాహనాలను పూర్తిగా నిషేధించడంతో గామన్ వంతెనపై రాకపోకలు పెరిగాయి. ఈనెల 24న సాయంత్రం వంతెనపై 52వ స్తంభం వద్ద వైబ్రేషన్స్ అధికంగా రావడాన్ని గుర్తించిన సిబ్బంది వంతెనపై ఒకవైపు వాహన రాకపోకలను ముందస్తు జాగ్రత్త చర్యగా నిలుపుదల చేశారు. ఒకవైపు మాత్రమే వాహనాలను అనుమతించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. భారీ వాహనాలు ఓవర్‌లోడ్ రాకపోకలు సాగించడంతో వంతెన జాయింట్లవద్ద యాక్లస్ బేరింగ్‌లు దెబ్బతినడంగాని, స్ప్రింగ్స్ కట్ అవ్వడంగాని జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు. మరోవైపు వంతెనకు అనుకుని గోదావరి నదిలో యంత్రాలతో డ్రెడ్జింగ్ చేపట్టి ఇసుక తవ్వకాలు చేపట్టడం ఓ కారణంగా భావిస్తున్నారు. ఏదైనా నిపుణుల బృందం వచ్చి పరిశీలించిన తరువాత గాని ఏ విషయాన్ని చెప్పలేమని అధికారులు చెబుతున్నారు. ఆర్డీసీ ఈఈ శ్రీకాంత్ మాట్లాడుతూ గామన్ వంతెనపై కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలో 52వ స్తంభం వద్ద అధికంగా వైబ్రేషన్స్ రావడంతో ముందస్తు జాగ్రత్త చర్యగా వంతెనపై ఒకవైపు రాకపోకలు నిలుపుదల చేశామన్నారు. బ్రిడ్జి స్ట్రక్చర్‌కు ఎటువంటి ప్రమాదం లేదని, భారీ వాహనాల రాకపోకలతో జాయింట్ల వద్ద యాక్లస్ బేరింగ్‌లు దెబ్బతిని ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు. హైదరాబాద్ నుంచి నిపుణుల బృందం వస్తోందని, వంతెనను పరిశీలించి సమస్య ఉంటే మరమ్మతులు చేపట్టి వాహనరాకపోకలను అనుమతిస్తుందని చెప్పారు.


కుంగిన ప్రాంతం వద్ద దిగబడిపోయిన రోడ్డు


గామన్ వంతెనపై ఒకవైపు మాత్రమే రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

పిఠాపురం నుంచి
పవన్ ఎన్నికల శంఖారావం

- 30నుంచి ప్రచారం ప్రారంభం
- మూడు రోజులు ఇక్కడే
- ఉగాది వేడుకల్లో పాల్గొంటానని వెల్లడి



పిఠాపురం, మార్చి25: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తాను పోటీ చేస్తున్న కాకినాడజిల్లా పిఠాపురం నియోజకవర్గం నుంచే ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఈనెల 30వ తేదీ నుంచి ప్రచారం ప్రారంభించనున్నారు. మూడు రోజులపాటు ఇక్కడే ఉండి పలు సమావేశాల్లో పాల్గొంటారు. ఉగాది వేడుకలను ఇక్కడే జరుపుకుంటారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్‌కల్యాణ్ సోమవారం పార్టీ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఇందులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 30వ తేదీన ఎన్నికల శంఖారావాన్ని పూరించేందుకు సిద్ధమయ్యారు. పిఠాపురం కేంద్రంగానే రాష్ట్రవ్యాప్త ప్రచారానికి వెళ్తానని, అందుకు అనుగుణంగా ప్రచారం షెడ్యూల్స్ ఉండాలని సూచించారు. మూడు విడతలుగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. ప్రతి విడతలో జనసేన పోటీచేసే నియోజకవర్గాలకు వెళ్లేలా షెడ్యూల్స్ ఉండాలని తెలిపారు.

పిఠాపురంలో పర్యటన ఇలా

పిఠాపురం నియోజకవర్గానికి 30వ తేదీన చేరుకునే పవన్‌కల్యాణ్ అష్టాదశ శక్తి పీఠాల్లో దశమశక్తి పీఠం అధిష్ఠాన దేవతయిన పురుహూతికాఅమ్మవారిని దర్శించుకుంటారు. అక్కడే వారాహి వాహనానికి పూజలు నిర్వహిస్తారు. అనంతరం దత్తపీఠాన్ని దర్శించుకుంటారు. అప్పటినుంచి మూడురోజులపాటు పిఠాపురం నియోజకవర్గంలోనే ఉండి పార్టీ నాయకులతో అంతర్గత సమావేశాలు జరుపుతారు. క్రియాశీలక కార్యకర్తలతో మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తారు. కూటమిలో భాగస్వాములైన తెలుగుదేశం, బీజేపీ నాయకులతో భేటీకి ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి సమావేశం ఉప్పాడలో జరుగుతుంది. నియోజకవర్గంలోని బంగారుపాప దర్గా సందర్శనతోపాటు క్రైస్తవ పెద్దలతో జరిగే సమావేశాల్లో పాల్గొంటారు. సర్వమత ప్రార్థనల్లో పాల్గొంటారు. ఉగాది వేడుకలను పిఠాపురం నియోజకవర్గంలోనే నిర్వహించుకోవాలని పవన్‌కల్యాణ్ నిర్ణయించుకున్నారు. పవన్ పర్యటన ఖరారు కావడంతో జనసేన నాయకులు ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. మూడురోజుల పర్యటనలో ఒక బహిరంగ సభ నిర్వహించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి అధికారికంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

వెంకటేశ్వరుడి కల్యాణంలో అపశృతి

- యువకుడు బహిర్భూమికి వెళ్లే సమయంలో గొడవ
- కత్తులతో పొడిచి యువకుడి హత్య
- మరో ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలు
- భద్రాచలానికి చెందిన ఆరుగురు యువకుల దాడి
- పరారీలో నిందితులు


మృతి చెందిన సాయికుమార్

ఎటపాక, మార్చి 26 : అల్లూరి జిల్లా ఎటపాక మండలం వెంకటరెడ్డిపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణంలో అపశృతి చోటుచేసుకుంది. బహిర్భూమికి వెళ్లే సమయంలో గొడవజరిగి అది పెద్దదిగా మారి యువకుని హత్యకు దారి తీసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎటపాక మండలం వెంకటరెడ్డిపేటకు చెందిన స్థానిక యువకుడైన కొరిమి సాయి మధ్యాహ్నం సమయంలో వెంకటేశ్వరుడి ఆలయం సమీపంలోని జామాయిల్ తోటవైపు బహిర్భూమికి వెళ్లాడు. అదే జామాయిల్ తోటలో భద్రాచలం పట్టణానికి చెందిన ఆరుగురు యువకులు ఆహార పదార్థాలను తింటున్నారు. ఆవైపు బహిర్భూమికి వెళ్లేసాయిని చూసి భద్రాచలంనకు చెందిన ఆరుగురు యువకులు ఇటువైపు ఎందుకు వచ్చావు రా.. అంటూ స్థానికుడైన సాయివద్ద నుంచి వాటర్‌బాటిల్ లాక్కుని, ఇష్టానుసారం దుర్భాషలాడుతూ గొడవపడి తిట్టి పంపారు దాంతో సాయి తన స్నేహితులైన అజ్మీర సాయికుమార్, నక్కిన పోయిన శ్రీనును వెంట తీసుకుని వారి వద్దకు వెళ్లాడు. ఈనేపథ్యంలో రెండు గ్రూపుల యువకులు ఘర్షణ పడ్డారు. అనంతరం బాహాబాహికి దిగారు. ఈ నేపథ్యంలో భద్రాచలం పట్టణానికి చెందిన ఓ యువకుడి వద్ద బటన్ కత్తి ఉండడంతో అజ్మీర సాయికుమార్‌పై కత్తి పోట్లు పొడిచాడు. తీవ్రంగా గాయపడ్డ సాయిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.సాయికుమార్ స్నేహితులైనసాయి, నక్కినపోయిన శ్రీనులపై ఆరుగురు యువకులు కత్తులతో దాడి చేసే ప్రయత్నం చేశారు. అయితే వారు తప్పించుకోవడంతో చేతులపై తీవ్రగాయా లయ్యాయి. గాయపడ్డ యువకులను ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన సాయికుమార్‌ది రాంగోపాలపురం తండా, పదో తరగతి చదువుతున్నాడు. ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు హత్యపై దర్యాప్తు చేస్తున్నారు. ఎన్నికల వేళ, అందులోను ఆధ్యాత్మిక ప్రదేశం చోట హత్య జరగడంపై వెంకటేశ్వరుడి కల్యాణానికి విచ్చేసిన భక్తులు భయందోళనకు గురయ్యారు. మద్యంమత్తులో దాడి చేసినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఇటీవల భద్రాచలం పట్టణానికి చెందిన కొందరు పొరుగున ఉన్న ఎటపాకను అడ్డాగా మార్చుకు ంటూ గంజాయి సేవిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే ఎటపాకను అన్నీ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. ఇదే నేపథ్యంలో గంజాయి మత్తులోనే యువకులు దాడులకు తెగబడుతున్నట్లు విమర్శలు లేకపోలేదు. పోలీసులు, నిఘా వ్యవస్థలు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏలేరు కాలువలో పడి వృద్ధుడి మృతి

పెద్దాపురం, మార్చి 25: ఏలేరు కాలువలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన కాకినాడజిల్లా పెద్దాపురం మండల పరిధిలోని చద లాడ గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాడాల సూర్యనారాయ ణ (70) గత రెండు రోజులుగా కనిపించడంలేదు. బంధువులు ఇంటికి వెళ్లాడేమో అని కుటుంబ సభ్యులు అనుకున్నారు. బంధువుల ఇంటికి వెళ్లలేదని కుటుంబ సభ్యులు నిర్ధారించుకుని అతని కోసం గాలించడం మొదలుపెట్టారు. సోమవారం ఉదయం ఏలేరు కాలువలో ఒక మృత దేహం తేలుతూ స్థానికులకు కనిపించడంతో పోలీసులకు గ్రామస్థులు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకుతీసి అది సూర్యనారాయణదిగా గుర్తించారు. మృతుడికి కుమారుడు, కోడలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ సురేష్ కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రజలు సుఖశాంతులతో ఉండాలి'

దేవరపల్లి, మార్చి 25: ప్రపంచంలోని ప్రజలు సుఖశాంతులతో ఉండా లని, మరియమ్మతల్లి దీవెనలు అన్ని వర్గాల ప్రజలకు కలుగుతాయని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. మండలంలోని గౌరీపట్నంలో నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్మలగిరి విచ్చేసిన జయరావుకు పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, ఫాదర్లు స్వాగతం పలికారు. ఆయన నిర్మలగిరి మందిరం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తుల నుంచి దివ్యబలిపూజలు ఆశీర్వచనాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుణ్యక్షేత్రానికి కులమతాలకు అతీతంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి మేరీమాతను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకోవడం ఆనందకరమన్నారు. పుణ్యక్షేత్రానికి వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. కార్యక్రమంలో ఫాదర్లు అరోణు, మోజేష్, బాలరాజు, ఇమ్మానియేలు, ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్‌లో నైపుణ్యాలు సాధించాలి

- జీఎస్ఎల్‌లో జాతీయ సబ్ జూనియర్ ఫెన్సింగ్ పోటీలు
- 29 రాష్ట్రాల నుంచి పోటీలకు వచ్చిన క్రీడాకారులు


కత్తి యుద్ధం పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

రాజానగరం, మార్చి 25: కత్తి యుద్ధం ఏషియన్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన యోధురాలు(ఫెన్సర్)మొదటి భారతీయ వనిత సీఏ భవానీదేవిని స్ఫూర్తిగా ఫెన్సింగ్ (కత్తియుద్ధం)క్రీడలో నైపుణ్యాలు సాధించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.పద్మరాజు సబ్‌జూనియర్ ఫెన్సర్లకు పిలుపునిచ్చారు. యువజన, సాంస్కృతికశాఖ ఎఫ్ఏఏపీ(ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో 25వ జాతీయ సబ్ జూనియర్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు జీఎస్ఎల్ ప్రాంగణంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నన్నయ వీసీ పద్మరాజు, జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరావు ముఖ్యఅతిథులుగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ ప్రత్యర్థిపై దాడిచేయడం, కాపాడుకోవడంలో శారీరక చురుకుతనంతో పాటు, బుద్ధి కుశలత ఎంతో ముఖ్యమని, ఈ రెండింటినీ సమన్వయం చేసుకున్న వారు ఫెన్సింగ్‌లో ఉత్తమ ప్రమాణాలు సాధించగలరని చెప్పారు. సీనియర్ నేషనల్ ఫెన్సర్, ఎఫ్ఏఏపీ రాష్ట్ర కార్యదర్శి జీవీస్వీ కృష్ణభగవాన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి 10నుంచి 14 ఏళ్ల వయసున్న 250 మంది బాలికలు, 271 మంది బాలురు, 160 మంది కోచ్‌లు, మేనేజర్లు, టెక్నీషియన్లు ఫెన్సర్ల తల్లిదండ్రులు ఈ పోటీలకు హాజరైనట్టు చెప్పారు. మాజీ సెక్రటరీ, అసోసియేషన్ మెంటార్ ఎస్.సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఇద్దరి మధ్య 3 నిమిషాలు వంతున నిమిషం వ్యవధితో వెంట వెంటనే మూడుసార్లు పోటీ ఉంటుందన్నారు. 15 పాయింట్లు సాధించిన వారు విజేతలని, పోటీల్లో నైపుణ్యాలను కచ్చితంగా గుర్తించడానికి ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగిస్తున్నామని, ఈ చాంపియన్‌షిప్‌లో విజేతలకు బంగారు, వెండి, కాంస్య పతకాలు బహుమతులుగా అందజేయనున్నట్టు చెప్పారు.

సత్యదేవుడిని దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



అన్నవరం, మార్చి 25: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కామేశ్వరరావు కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కంచి మూర్తి, ఏపీఆర్వో గణపతిరావు తదితరులున్నారు.

నేడు హుండీల ఆదాయం లెక్కింపు

సత్యదేవుడి సన్నిధికి విచ్చేసిన భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించనున్నారు. ప్రత్యేక విధులు కేటాయించిన సిబ్బంది అంతా హుండీల లెక్కింపునకు హాజరుకావాలని ఈవో రామచంద్ర మోహన్ సర్క్యులర్ జారీ చేశారు.

28నుంచి ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలు

- కిర్లంపూడిలో ముగిసిన శిక్షణ
- ఆంధ్రప్రదేశ్ జట్టు ఎంపిక

కిర్లంపూడి, మార్చి 25: ఈనెల 28 నుంచి ఏప్రిల్ 1వరకు ఢిల్లీలో 56వ అఖిలభారత జాతీయ సీనియర్స్ ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈనెల 14 నుంచి కాకినాడజిల్లా కిర్లంపూడి హైస్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టుకు ఇస్తున్న శిక్షణ సోమవారంతో ముగిసింది. కిర్లంపూడిలో జరిగిన శిక్షణ శిబిరానికి విజయనగరం, వైజాగ్, తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, కర్నూల్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. వారికి పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చిన అనంతరం తుది జట్టును ఎంపిక చేశారు. ఈసందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏపీ ఖోఖో అసోసియేషన్ చీఫ్ పాటర్నర్ పెంటకోట నాగబాబు, జిల్లా ఖోఖో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చదలవాడ బాబి, జాన్ మోజేష్, దాడి గోవింద్ హాజరయ్యారు. జట్టు కోచ్‌గా అంతర్జాతీయ రైల్వే క్రీడాకారుడు కర్రి శ్రీనివాసరావు, అసిస్టెంట్ కోచ్‌గా కెవిఎల్ పాపారావు వ్యవహరించనున్నారు. ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టుకు పి.చక్రఅనూష, ఈ.హేమావతి, కె.కుమారి, ఎస్.అనురాధ, డి.శివనాగలక్ష్మి, డి.లఖిల, పి.రేవతి, కె.రమ్య, బి.శిరీష, వి.మోహనసత్యసింధు, పి.హేమ, వి.ప్రీతిరోజ్, ఎం.దివ్యశ్రీ, ఎం.అక్షయ, కె.చైతన్య ఎంపికయ్యారు. కార్యక్రమంలో కె.పట్టాభిరామ్, ఎం.సీతారామిరెడ్డి, పూర్వ జాతీయ క్రీడాకారులు పాల్గొన్నారు.

అనపర్తిలో టీడీపీకి 22 మంది నాయకుల రాజీనామా

- అనపర్తి సీటు మారిస్తే సహాయ నిరాకరణకు సిద్ధమంటూ ప్రకటన


రాజీనామా లేఖలను చూపుతున్న అనపర్తి నియోజకవర్గ టీడీపీ నాయకులు

అనపర్తి, మార్చి 25: తూర్పుగోదావరి జిల్లా అనపర్తి అసెంబ్లీ సీటును పొత్తుల్లో భాగంగా బీజేపీకి కేటాయిస్తున్నారంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో అనపర్తిలో టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. అదిష్టానం స్పష్టమైన ప్రకటన చేయాలని అనపర్తి సీటు టీడీపీ నాయకుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డికే నని అదిష్టానం ప్రకటన చేయాలంటూ ఆదివారం పార్టీ నాయకులు డిమాండ్ చేసినప్పటికీ అదిష్టానం నుంచి స్పష్టత రాకపోవడంతో సోమవారం అనపర్తి నియోజకవర్గం లోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులతోపాటు జిల్లా, రాష్ట్ర కమిటీల్లో పొందిన పదవులకు సుమారు 22మంది రాజీ నామాలు చేశారు. రాజీనామా లేఖలను రాజమహేంద్రవ రంలోని టీడీపీ జోన్-2 కార్యాలయంలో కోఆర్డినేటర్ సుజయ్‌కృష్ణ రంగారావుకు అందజేశారు. అనపర్తి టికెట్ ముందుగా ప్రకటించిన విధంగా టీడీపీకే ఇవ్వాలని అలాకాకుండా మా ర్చుచేస్తే వచ్చే ఎన్నికలలో నియోజకవర్గంలో పార్టీ నాయకులు శ్రేణులు సహాయనిరాకరణ చేపడతామనివారు పేర్కొన్నారు.

కన్నుల పండువగా
నరసింహుడి శ్రీ పుష్పయాగం


శ్రీ లక్ష్మీనరసింహస్వామికి శ్రీ పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం

కోరుకొండ, మార్చి 25: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు(5 రోజులు) ముగిసిన తర్వాత ఆరోరోజు సోమవారంరాత్రి స్వామివారికి పర్యాంగ సయనోత్సవం(శ్రీ పుష్పయాగం) కన్నుల పండువగా జరిగింది. ఆలయ అనువంశక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం అధికారుల ఆధ్వర్యంలో ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు, పెద్దింటి, పెదపాటి, పెరవళి, అనువంశక అర్చకస్వాములు శ్రీ పుష్పయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివ్రారిని ప్రత్యేక పల్లకీలో ఆశీనులను చేసి ఆలయం చుట్టూ ద్వాదశ ప్రదక్షిణలు చేయించారు. ఈ సందర్భంలో స్వామికి 11 రకాల పండ్లు, పుష్పాలతో నివేదన చేశారు. అనంతరం 12 రకాల ఆహార పదార్థాలతో 12 నివేదనలు సమర్పించారు. కార్యక్రమంలో కోరుకొండ పరిసర ప్రాంతాల భక్తులు, ధర్మకర్తలు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అరకు పార్లమెంటు పరిధిలో
సామాజిక పోరు

- ఒకే సామాజిక వర్గం నుంచి కొత్తపల్లి గీత, చెట్టి తనూజ

రంపచోడవరం, మార్చి 25: అరకు పార్లమెంటు నియోజవర్గంలో ప్రధాన పార్టీల మధ్య పోరు ఒకే సామాజికవర్గం మధ్య పోరుగా మా రింది. ఇక్కడ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థిగా కొత్తపల్లి గీత, వైసీపీ నుంచి చెట్టి తనూజారాణి తలపడుతున్నారు. వీరు ఇరువురూ కూడా వాల్మీకి సామాజికవర్గం కావడంతో పోరు రసవత్తరంగా మారనున్నది. ఈ పార్లమెంటు నియోజకవర్గంలో రంపచోడవరం, అరకు, పాడేరు సెగ్మెంట్లలో మాత్రమే అధిక సంఖ్యలో వాల్మీకి సామాజికవర్గం ఉంది. తక్కిన నాలుగు సెగ్మెంట్లలో ఈ సామాజికవర్గం సంఖ్య అతి తక్కువగానే ఉంది. ఒకే సామాజికవర్గానికి చెందిన ఇద్దరు పోటీ పడితే వారి విజయాన్ని నిర్దేశించేది మాత్రం ఇతర సామాజిక రాజకీయ అంశాలే! కాగా ఈ ఇరువురి మధ్య పోరును ఏఏ అంశాలు నిర్దేశిస్తాయన్నది చర్చినీయాంశంగా మారింది. గతంలో వైసీపీ నుంచి ఎంపీగా నిలిచి నియోజకవర్గంలో పరిచయాలు ఉండటం, బీజేపీలో చేరి పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉనికి చాటుకుంటున్న కొత్తపల్లి గీత విజయావకాశాలపై దీమాగా ఉన్నారు. ఇక వైసీపీ అభ్యర్థి విషయంలో స్థానికతతో పాటు ఇతర సామాజిక అంశాలు కూడా తమకు కలిసి వస్తాయన్న దీమాతో ఉన్నారు. ఏదిఏమైనా అరకు పార్లమెంటులో ఒకే సామాజికవర్గ పోరు రసవత్తరంగా మారనుంది.

కాకినాడ సాగరతీరంలో
ఇండో-యూఎస్ఏ నావికాదళ విన్యాసాలు

- నేటి నుంచి 31 వరకు టైగర్ ట్రంప్
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్


సూర్యారావుపేట బీచ్‌లో ఇండో-యూఎస్ఏ విన్యాసాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

సర్పవరం జంక్షన్, మార్చి 25: కాకినాడ సాగరతీరంలో ఈనెల 26 నుంచి 31 వరకు భారత్- అమెరికా దేశాల సంయుక్త నావికా దళ విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ఇండియా-యూఎస్ఏ ఆధ్వర్యంలో సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్ ప్రాంతంలో నిర్వహించనున్న టైగర్ ట్రంప్ విన్యాసాల ఏర్పాట్లను నావికా దళాల అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేవెల్ ఎన్‌క్లేవ్ పరిధిలో ఆరు రోజుల పాటు జరిగే టైగర్ ట్రంప్ విన్యాసాల్లో నేవీ, ఆర్మీలు సంయుక్తంగా విన్యాసాలు నిర్వహిస్తాయన్నారు. సంయుక్త విన్యాసాల్లో భారతదేశ రక్షణ దళాలు, యూఎస్ రక్షణ బలగాలకు చెందిన అధికారులు, సిబ్బంది సుమారు 800 మంది వరకు పాల్గొంటారన్నారు. అలాగే యుద్ధనౌకలు, యుద్ధట్యాంకర్లతో, వైమానిక దళాలతో విన్యాసాలు జరుగుతాయన్నారు. దేశ రక్షణ, భారత భూభాగంలో టెర్రరిస్టులు, శత్రువులు సముద్రమార్గాన వచ్చి దాడి చేసినప్పుడు వారిని ఏవిధంగా ఏదుర్కోవాలి, ఉగ్రవాద నిర్మూలన, శత్రుదేశాలతో యుద్ధ సమయంలో చేసే విన్యాసాలు ఇక్కడ నిర్వహిస్తారన్నారు. ప్రతిష్ఠాత్మక విన్యాసాలు జరిగే సమయంలో మంగళవారం నుంచి ఈనెల 29 వరకు బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. ఉప్పాడ సెంటర్ నుంచి లైట్‌హౌస్ వరకు వాహనాలకు అనుమతి లేదన్నారు. అచ్చంపేట జంక్షన్‌మీదుగా పిఠాపురం వైపు వెళ్లేలాచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్డీపీవో హనుమంతరావు, కాకినాడరూరల్ సర్కిల్ సీఐ కె.శ్రీనివాస్, తిమ్మాపురం ఎస్ఐ రవీంద్రబాబు, నేవీ అధికారులు పాల్గొన్నారు.

రంప అటవీ డివిజన్లో
ఇంటి దొంగలు

- 400కు పైగా టేకు చెట్లు నరికేసి 300కి పైగా తరలించేసిన వైనం
- ఇద్దరు తాగుబోతు దొంగల వాగ్వాదంతో భాగోతం బట్టబయలు
- రంగంలోకి దిగి నిగ్గుతేల్చిన అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్
- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు, ఇతర టెక్నాలజీతో బాధ్యులను గుర్తించే చర్యలు



మిగిలిపోయిన కలపను కొలవడానికి వచ్చిన అటవీశాఖ అధికారులు, మిగిలిపోయిన టేకు కలప దిమ్మలు

రంపచోడవరం, మార్చి 25: అల్లూరి జిల్లా రంపచోడవరం అటవీశాఖ డివిజన్లో సుమారు 400కు పైగా టేకు చెట్లు అక్రమ నరికివేతకు గురికాగా వాటిలో సుమారు 300కు పైగా చెట్లు గల్లంతయ్యాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం తరలిపోయిన చెట్ల విలువ సుమారు రూ.40 లక్షలు కాగా, సుమారు రూ.12 లక్షల విలువైన టేకు దిమ్మలను తరలింపు కోసం సిద్ధం చేసుకోగా ఇందులో భాగస్వాములైన ఇద్దరు తప్పతాగి తెచ్చుకున్న వాగ్వివాదం ఈ మొత్తం భాగోతాన్ని బట్టబయలు చేసింది. దీనిపై లోతుగా గమనిస్తే ఇదంతా అటవీశాఖలోని ఇంటి దొంగలందరూ తలాపాపం తిలా పిడికెడు అన్నచందంగా తేలింది. రాజమహేంద్రవరంలోని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ వై.శ్రీనివాసరెడ్డి నేరుగా రంగంలోకి దిగి జరిగిన అటవీ వినాశనంతోపాటు ఎంత విలువైన చెట్లు దొంగిలించబడ్డాయో నిగ్గుతేల్చారు. ఎవరిపాత్ర ఎంత ఉందో, ఇందుకుగల కారణాల నిగ్గు తేల్చేందుకు ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ఆరుగురు డి.ఎఫ్.ఓ.లతో ఆరు కమిటీలను నియమించారు. రంపచోడవరం, మారేడుమిల్లి అటవీశాఖ రేంజ్ పరిధిలోని వెలుగుచూసిన ఈ భాగోతం పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. రంపచోడవరం రేంజ్ మారేడుమిల్లి రేంజ్ పరిధిలో అటవీశాఖకు చెందిన టేకు ప్లాంటేషన్లు విస్తృతంగా ఉన్నాయి. వాస్తవానికి నిర్దేశిత కాలం అనంతరం ఆయా ప్లాంటేషన్లలో టేకు చెట్లను అటవీశాఖే నరికించి అనంతరం కొత్త ప్లాంటేషన్లను వేయిస్తోంది. రంపచోడవరం రేంజ్ పరిధిలోని దేవరపల్లి బీటు, మారేడుమిల్లి రేంజ్ పరిధిలోని మారేడుమిల్లి బీటులలో ఉన్న టేకు ప్లాంటేషన్లలో సుమారు 400కు పైగా టేకుచెట్లను అక్రమంగా నరికేసి, వాటిలో సుమారు రూ.40 లక్షలకు పైబడిన విలువ కలిగిన 300కు పైగా టేకు చెట్లను తరలించేశారు. ఎంతో పగడ్బందీగా చీపురు పుల్లను సైతం అడవి దాటకుండా కాపు కాసే అటవీ శాఖ ఠాణా(చెక్ పోస్టు)లను ఈ టేకు కలప దర్జాగా దాటిపోయింది. ఈ అటవీ సంరక్షణ కోసం ఏర్పాటుచేసిన బేస్ క్యాంపులలో తాత్కాలికంగా పనిచేస్తున్న వారే ఇందులో కీలకపాత్ర పోషించారని, వారిలో ఇద్దరు తప్పతాగి ఒకరిపై ఒకరు దొంగతనాలను ఆపాదించుకుంటూ వాగ్వాదానికి దిగడం ద్వారా వారు వెలగబెట్టిన భాగోతం మొత్తం బయటపడింది. ఇది తెలిసిన మరుక్షణం రాజమండ్రి ఫ్లయింగ్ స్క్వాడ్ డి.ఎఫ్.ఓ. ప్రాథమిక విచారణ జరిపి చీఫ్ కన్జర్వేటర్‌కు నివేదించారు. దీంతో చీఫ్ కన్జర్వేటర్ శ్రీనివాసరెడ్డి ఈనెల కొద్ది రోజుల క్రితం ఈ రెండు రేంజ్‌ల పరిధిలో పర్యటించారు. మొత్తంగా సుమారు రూ.50లక్షలకుపైగా అటవీ వినాశనం జరిగి, అటవీ సంపద దొంగతనానికి గురైందని గుర్తించారు.

నిగ్గుతేల్చడానికి ఆరు బృందాలు నియామకం

ఇక్కడ నరికివేయబడిన టేకు చెట్లు ఏఏ ఠాణాల మీదుగా ఎక్కడకు వెళ్లిపోయాయో, ఎవరెవరు ఇందులో భాగస్వాములుగా ఉన్నారో, క్షేత్రస్థాయి నుంచి డివిజన్‌స్థాయి వరకూ అధికారులు, సిబ్బంది పోషించిన పాత్రలను నిగ్గుతేల్చాలని రాజమహేంద్రవరం ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో, కాకినాడ డీఎఫ్‌వో, భీమవరం డీఎఫ్‌వో, అమలాపురం డీఎఫ్‌వో, రాజమహేంద్రవరం డీఎఫ్‌వో, జంగారెడ్డిగూడెం సబ్‌డీఎఫ్‌ల ఆధ్వర్యంలో ఆరు బృందాలను నియమించారు. ఈ బృందాలు గత ఏడాది కాలంగా రంపచోడవరం డివిజన్‌పరిధిలో నమోదైన అన్నిరకాల కేసులను, ఆయా ప్లాంటేషన్లపై సాగిన అధికారుల పరిశీలనా నివేదికలను, ఆయా అధికారుల టూరు డైరీలను కూడా పరిశీలించాలని సి.సి.ఎఫ్ ఆదేశించారు. ఇంత పెద్దఎత్తున అటవీ వినాశనమే కాకుండా ప్రభుత్వ ఖజానాకు చేరాల్సి ఆదాయానికి నష్టం వాటిల్లడానికి పై నుంచి కింద వరకూ నిర్లక్ష్యం వహించిన అందరిపైనా చర్యలకు చీఫ్ కన్జర్వేటర్ రంగం సిద్ధం చేస్తున్నారు.

మెట్టలో మండుతున్న ఎండలు

ప్రత్తిపాడు, మార్చి 25: జిల్లాలో మెట్ట ప్రాంతంలో ఎండలు మండుతున్నాయి. గత నాలుగు రోజులుగా భానుడు భగభగ మండుతుండడంతో ఎండల తీవ్రతకు జనం బెంబేలెత్తుతున్నారు. సోమవారం మధ్యాహ్నం భానుడు ప్రతాపానికి ప్రజలు విలవిలలాడారు. ప్రత్తిపాడు- ధర్మవరం 16వ నెంబరు జాతీయ రహదారిపై ఎండ తీవ్రతకు వాహన రాకపోకలు మధ్యాహ్నం సమయంలో నిలిచిపోవడంతో రహదారి నిర్మానుషంగా మారింది.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

జేసీ రామసుందరరెడ్డి

పిఠాపురం, మార్చి 25: ఓటర్ల వివరాలు సరిచేస్తామంటూ ల్యాప్‌ట్యాప్‌లతో వచ్చే అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టరు రామసుందరరెడ్డి సూచించారు. నియోజకవర్గంలో కొంత మంది వ్యక్తులు ల్యాప్‌టాప్‌లతో ఇంటింటికి తిరుగుతూ కొత్త ఓటర్లు నమోదు చేస్తామని, ఓటర్ల వివరాలు తప్పుగా ఉంటే సరిచేస్తామని ప్రచారం చేస్తూ వివరాలు తీసుకుంటున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అటువంటి వారిని నమ్మవద్దని, ప్రజలు తమ వ్యక్తిగత వివరాలు తెలియజేయవద్దని ఆయన కోరారు. అటువంటి వ్యక్తులు ఎవరైె వస్తే వెంటనే సమీప బూత్ లెవిల్ అధికారులు, ఏఈఆర్‌వోలకు తెలియజేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

'నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి'



దుర్గాడలో ప్రజలతో సమావేశమైన పోలీసులు

గొల్లప్రోలు రూరల్, మార్చి 25: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పోలీసు అధికారులు కోరారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో సోమవారం సాయంత్రం కేంద్ర బలగాలతో కలిసి వారు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమైన ఎన్నికల ప్రశాంత నిర్వహణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి : ఆర్డీవో



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కిషోర్

సర్పవరం జంక్షన్, మార్చి 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతీ పోలింగ్ కేంద్రంలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఇట్ల కిషోర్ ఆదేశించారు. సోమవారం కాకినాడ రూరల్ సూర్యారావుపేట, 48వ డివిజన్ పరిధిలో గల ఎస్.అచ్చుతాపురంలో పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ బీవిజయప్రసాద్‌తో కలసి పరిశీలించారు. నియోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. డిప్యూటీ తహశీల్దార్ సురేష్, బీఎల్వోలు ఉన్నారు.

'జగన్ విముక్త రాష్ట్రం మన ధ్యేయం'

గొర్రిపూడి (కరప), మార్చి 25: జగన్ విముక్త రాష్ట్రం మన ధ్యేయంగా వచ్చే ఎన్నికల్లో పనిచేయాలని టీడీపీ కాకినాడ రూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పిలుపునిచ్చారు. కరప మండలం గొర్రిపూడిలో సోమవారం టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించి కూటమి గెలుపునకు సహకరించాలని కోరారు. వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ గెలుపునకు ప్రతీఒక్కరూ శక్తివంచన లేకుండా కృషిచేయాలని విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర బాగు కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ ఏకమయ్యాయని, ఎన్‌డీఏ కూటమికి మద్దతుగా నిలిచి వైసీపీని సాగనంపాలన్నారు. ఆయా పార్టీల నాయకులు పంతం సందీప్, బుంగా సింహాద్రి, గుల్లిపల్లి శ్రీనివాసరావు, బండారు మురళి, గండి వెంకటేశ్వరరావు, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, యనమదల దొరబాబు, మద్దూరి స్వామి, ఓలేటి సూర్యనారాయణ, గండి యారీష్‌కుమార్, అనుకుల రాంబాబు,సురేష్ ఉన్నారు.

'ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా కృషి'

కొత్తపల్లి, మార్చి 25: నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి నైపుణ్యాలను పెంచడం ద్వారా మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా కృషి చేస్తున్నామని, మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్స్ కె నిత్యానందరెడ్డి, పి.శరత్‌చంద్రరెడ్డి తెలిపారు. సోమవారం కొత్తపల్లి మండలం సెజ్ ప్రాంతంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న 77 మంది యువతీ,యువకులకు సెజ్ జనరల్ మేనేజర్లు మంతా శ్రీనివాస్, వీరారెడ్డిల చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సిటీ వారితో సమానంగా పోటీ పడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా నిపుణులైన ఫ్యాకల్టీలతో గ్రామీణ ప్రాంత యువతకు నైపుణ్యాల పెంపు, బేసిక్స్ కంప్యూటర్ ప్రోగ్రామ్స్‌లో నాణ్యమైన శిక్షణ ఇప్పిస్తున్న అరబిందో నిర్వాహకులను మేనేజర్లు శ్రీనివాస్, వీరారెడ్డి అభినందించారు. శిక్షణ సద్వినియోగం చేసుకుని జీవన ప్రమాణాలు పెంచుకోవాలని కోరారు.

'కుళాయిల ద్వారా దుర్వాసనాభరితంగా నీరు'

సామర్లకోట, మార్చి 25: పట్టణంలో మున్సిపాల్టీ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు ఎటువంటి క్లోరినేషన్ లేకుండా దుర్వాసనాభరితంగా ఉండడంతో 2 రోజులుగా ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మాజీ కౌన్సిలర్ చుండ్రు బలరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇదే రీతిలో కుళాయిల ద్వారా దుర్వాసనతో కూడిన తాగునీటిని సరఫరా చేయడంతో ప్రజలు ఆ నీటిని తాగేందుకు తీవ్ర విముఖత చూపుతున్నారన్నారు. మున్సిపల్ డీఈ అధికారిని ఎన్నడూ తాగునీటి సరఫరాను పరిశీలించిన దాఖలాలు లేకపోవడం వల్ల సిబ్బందిపై అజమాయిషీ కొరవడి తాగునీరు క్లోరినేషన్ చర్యలు లోపిస్తున్నాయన్నారు. జిల్లా అధికారులు సత్వరం స్పందించి పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన, స్థానికులు కోరుతున్నారు.

'తోటివారికి సేవ చేయడంలోనే సంతృప్తి'

పిఠాపురం, మార్చి 25: మన సంపాదనలో కొంతభాగాన్ని తోటివారికి సహాయం చేయడంలోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా పిఠాపురంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొహిద్దీన్ బాద్షా మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు బియ్యం, చీరలు పంపిణీ చేశారు. మానవసేవే మాధవసేవ అన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అహ్మద్ ఆలీషా, హుస్సేన్‌షా, అఫ్షాన్, ఆయాన్‌షా, జహీన పాల్గొన్నారు.

ఉప్పాడ బీచ్‌లో వాహనాల తనిఖీ

కొత్తపల్లి, మార్చి 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం,నగదు రవాణాను నిరోధించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌లో కొత్తపల్లి ఎస్‌ఐ పీవీ.స్వామినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది వాహనలను తనిఖీలు చేశారు. వియాత్నం దేశానికి చెందిన విదేశీయుడు ప్రయాణిస్తున్న వాహనాన్ని చెకింగ్ చేసే సమయంలో కారులో రూ.1.30 లక్షల నగదును గుర్తించారు. ఈ సొమ్ము విషయమై ఎన్నికల స్క్వాడ్ అధికారులకు ఎస్‌ఐ అప్పగించారు. విదేశీయుడు కావడం, ఖర్చుల కోసం తన వద్ద నగదును ఉంచుకున్నట్లు తగిన ఆధారాలు స్క్వాడ్ అధికారులకు చూపించడంతో నగదును తిరిగి అప్పగించారని ఎస్‌ఐ చెప్పారు.

కౌంటింగ్ సెంటర్‌ను సందర్శించిన ఆర్వో

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 25: కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు జేఎన్టీయూకే ఆవరణలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు. ఎన్నికల సిబ్బంది, అధికారులతో కలిసి సివిల్ బ్లాక్‌లోని ఆయా కేంద్రాలను పరిశీలించారు. అవసరమైన సదుపాయాలన్నీ ఉన్నాయో లేదో ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఆర్‌వో దొర, డీటీ సీతాపతిరావు, ఏఈ రమేష్, సర్వేయర్ ఆచార్యులు, శానిటరీ సూపర్‌వైజర్ జిలానీ, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఉన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

గండేపల్లి, మార్చి 25: మండలంలో సింగరాయపాలెంలో మందపల్లి మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా గత 4రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు ముగిశాయి. ఫైనల్ పోటీలు ఆదివారం రాత్రి జరగగా రాజానగరం జట్టు మొదటి స్థానంలో, కానవరం జట్టు 2, నరేంద్రపురం 3, దివాన్ చెరువు జట్లు నాలుగు స్థానాల్లో నిలిచాయి. మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.15వేలు నగదుతో పాటు ట్రోఫీలను కోర్పు లచ్చయ్యదొర అందజేశారు. కార్యక్రమంలో జయశ్రీ, దుర్గాప్రసాద్, జోగేశ్వరి, పీడీలు నాగరాజు, శ్రీనివాస్, ప్రసాద్, ఆనంద్ పాల్గొన్నారు.

అధికారంలోకి రావడం ఖాయం

» ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

» టీడీపీ నాయకుల ఎన్నికల ప్రచారం

సామర్లకోట, మార్చి 25: రాబోయే రోజుల్లో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని మీ అందరికీ అండగా ఉంటామని, ప్రతీ ఒక్కరూ తెలుగుదేశం విజయం కోసం కృషి చేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే, టీడీపీ జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సోమవారం రాత్రి సామర్లకోటలోని సాయినగర్, కొత్తలేఅవుట్, క్వారీ గేతులు, విమల్ లేఅవుట్ తదితర ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారాన్ని రాజప్ప నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారం కోసం కుయుక్తులు, కుట్రలు, దౌర్జన్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతీ కార్యకర్త సిద్ధం ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజలంతా ఏకమై తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలవాలన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రానికి స్వర్ణయుగం వస్తుందన్నారు. భూహక్కు చట్టం పేరుతో ప్రజల స్థిరాస్తులను లాక్కొనేందుకు జగన్‌రెడ్డి కుట్రపన్నారని ఆరోపించారు. పలు కూడలి ప్రాంతాల్లో రాజప్పకు మహిళలు మంగళహారతులతో పెద్దఎత్తున నీరాజనాలు అందించారు. అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ మండల, పట్టణ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



సామర్లకోట ఎన్నికల ప్రచారంలో రాజప్ప

'వైసీపీని ఇంటికి పంపించాలి'

గండేపల్లి, మార్చి 25: అరాచక పాలన కొనసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని, జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపించే కాలం దగ్గరపడిందని జగ్గంపేట టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. ఆయన సోమవారం ఎన్నికల ప్రచారాన్ని మండలంలో తాళ్ళూరులో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచార రథం ఎక్కి గ్రామంలో పర్యటించారు. ఇంటింటా ప్రచారం చేసి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయనకు ప్రజల ఘన స్వాగతం పలికారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం జెడ్ రాగంపేటలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ కార్యదర్శులు ఎస్వీఎస్ అప్పలరాజు, కోర్పు లచ్చయ్యదొర, మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, యువనాయకులు జాస్తి వసంత్, కందుల చిట్టిబాబు, కుంచే రాజా, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, దాపర్తి సీతారామయ్య, అడబాల భాస్కరరావు, సుంకవిల్లి రాజు, శీలమంతుల వీరబాబు, పైణ్ణి వెంకటేశ్వరరావు, బాలు, తెలగరెడ్డి భద్రరావు, మాదిరెడ్డి కృష్ణార్జున, పెనుమర్తి భాస్కరరావు, సుంకవిల్లి సత్యనారాయణ, బైపిన సోమరాజులు, బొల్లంరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.



గండేపల్లి: ప్రచారం ప్రారంభిస్తున్న నెహ్రూ

మల్లవరంలో...

జగ్గంపేట, మార్చి 25: గోకవరం మండలం మల్లవరం గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ గెలుపు కోసం జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సతీమణి లక్ష్మీదేవి, తనయుడు అనీష్ నెహ్రూతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సైకిల్‌గుర్తుపై ఓట్లు వేసి నెహ్రూని గెలిపించాలని కోరారు. మంగరౌతు రామకృష్ణ, పాలూరి బోసుబాబు, బత్తుల సత్తిబాబు, మల్లవరం సర్పంచ్ విడుదల లక్ష్మి అర్జున్‌రావు, ఎంపీటీసీ మరిసే అరుణ, అప్పారావు, యువనేత సత్యంరాజా, గల్లా రాము, మండిగ బాలాజీ, మండిగ గంగాధర్ పాల్గొన్నారు.

వీరవరంలో...

కిర్లంపూడి, మార్చి 25: మండలంలో వీరవరంలో ఎంపీపీ తోట రవి, తోట గాంధీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు టీడీపీ కరపత్రాలు ఇంటింటా పంచిపెట్టారు. పాలెం గ్రామంలో టీడీపీ నాయకుడు ఆళ్ల రవికిషోర్, క్లస్టర్ ఇన్‌చార్జి పాటంశెట్టి మురళీకృష్ణ, అడబాల కొండబాబు ఆధ్వర్యంలో ఇంటింటా టీడీపీ ప్రచారం చేశారు. జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత ఇంటింటికి వెళ్లి టీడీపీ కరపత్రాలు అందించి నెహ్రూను గెలిపించాలని కోరారు. టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, ఆళ్ల శివ, తూము కుమార్, సర్పంచ్‌లు పట్టు చంటిబాబు, జ్యోతుల రాంబాబు, గొడే బాల, అల్లుమల్ల బాబి, కొప్పిశెట్టి అప్పలరాజు, దాడి సుబ్బారావు,పోతుల సత్తిబాబు ఉన్నారు.

'కాకినాడను కాపాడుకోవాలి'

కాకినాడ సిటీ, మార్చి 25: వైసీపీ రాక్షస పాలన నుంచి కాకినాడను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కాకినాడ సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు పైడా భవనప్రసాద్, జనసేన నాయకుడు సత్యనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం 9వ డివిజన్ దుర్గమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే సుపరిపాలన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పైడా వెంకటనారాయణ, టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, గ్రంధి బాబ్జి, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, గదుల సాయిబాబు, ఎంఏ తాజుద్దీన్, బచ్చు శేఖర్, సీకోటి అప్పలకొండ, అంబటి చిన్న, నల్లూరి శ్రీనివాస్, చొల్లంగి వీరబాబు, జొన్నాడ వెంకటరమణ, అమలకంటి బలరామ్, రెడ్నం సత్తిబాబు, మూగు రాజు, ఏవీడీ మెంటారావు, మేడిశెట్టి చిన్ని, పాలిక నాని, కొక్కిలగడ్డ గంగరాజు, డివిజన్ నాయకులు వాసంశెట్టి చిట్టప్ప, పాల్గొన్నారు.



కాకినాడలో ప్రచారం నిర్వహిస్తున్న కొండబాబు

భవిష్యత్తు గ్యారంటీ టీడీపీతోనే సాధ్యం

» శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల

» వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

తుని రూరల్, మార్చి 25: భవిష్యత్తు గ్యారంటీ ఒక్క టీడీపీతోనే సాధ్యమని శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట యనమల స్వగృహంలో నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన విషయాలపై చర్చించారు. అనంతరం తొండంగి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన పలు వైసీపీ కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరగా వీరికి యనమల పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలోకి చేరినవారిలో పల్లా లోవరాజు, బర్ల కొండబాబు, పెండ్యాలసుబ్బారావు, పెండ్యాల లోవరాజుతో పాటుగా పలు కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో టీడీపీ యువనేత యనమల రాజేష్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), గొర్ల కొండబాబు, పెండ్యాల నాగేశ్వరరావు తదితరులున్నారు.

నెల్లిపూడి, మండపంలో...

శంఖవరం, మార్చి 25: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అరాచక పాలన పోయి చంద్రబాబు పాలన రావడం తథ్యమని ప్రత్తిపాడు ఉమ్మడి అభ్యర్థి వరుపుల సత్యప్రభ అన్నారు. సోమవారం నెల్లిపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, బద్ది రమణల ఆధ్వర్యంలో... మండపం నుంచి పోలం చిన్నా ఆధ్వర్యంలో 60కుటుంబాలు వైసీపీని వీడి సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. మండపం అంబేడ్కర్ యువత అధ్యక్షుడు నాగూరి వీరభద్రరావు, నెల్లిపూడిలో సైపి రెడ్డి సూరిబాబు, గరికపాటి గోవిందు, అద్రా గణేష్, అద్రా సత్యనారాయణ, అద్రా అప్పనబాబు తదితర నేతలు టీడీపీలో చేరారు. మండల నేతలు పర్వత సురేష్, వెన్నా ఈశ్వరుడు, కీర్తి సుభాష్, ఉల్లి వీరభద్రరావు, జనసేన నేతలు కరణం సుబ్రహ్మణ్యం, కీర్తి కుమార్,బీజేపీ కన్వీనర్ గంటాబాలుదొర ఉన్నారు.



తుని రూరల్: టీడీపీలో చేరినవారితో యనమల

గంగవరంలో....

రౌతులపూడి, మార్చి 25: గంగవరం గ్రామానికి చెందిన 50 కుటుంబాల వైసీపీ కార్యకర్తలు టీడీపీ చేరారు. టీడీపీ సీనియర్ నేత పాసిల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సోమరౌతు చెంబుబాబు, ప్రదీప్, దిలీప్, చిన్నాల సత్తిబాబు, రెడ్డి శ్రీరామ్‌తో 50 కుటుంబాలు టీడీపీలో చేరగా వారికి ప్రత్యప్రభ ఉమ్మడి అభ్యర్థి వరుపుల సత్యప్రభ పార్టీకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు తమరాల సత్యనారాయణ, ఎంపీటీసీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, గొల్లపల్లి బుజ్జి, సోమరౌతు రవి, జిల్లా రాజా, సింహాద్రి పెదకాపు, కోసూరి కృష్ణవర్మ, శీలంవరపు, పసగడుగుల రమణ తదితరులున్నారు.



రౌతులపూడి: టీడీపీలో చేరినవారితో సత్యప్రభ

జగన్ పాలనలో రక్షణ లేదు

ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి సత్యప్రభ

ప్రత్తిపాడు, మార్చి 25: జగన్ రెడ్డి పాలనలో బడుగు బలహీన వర్గాల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా విమర్శించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కడప జిల్లాలో వైసీపీ నాయకుల భూదాహానికి పాల సుబ్బారావు అనే చేనేత కార్మికుడు, అతడి భార్య, కుమార్తె బలవన్మారణానికి పాల్పడటం దారుణమన్నారు. గనులు, మద్యం వ్యాపారం చేసి జగన్ రాష్ట్రాన్ని దోచుకుంటే ఆయన అనుచరులు నిరుపేదల ఆస్తులు లాక్కుంటున్నారని మండిపడ్డారు. వైసీపీ నాయకులు భూ కబ్జాలు కారణంగా ముఖ్యమంత్రి సొంత జిల్లా కడప జిల్లాలోనే చేనేత కుటుంబం ఆత్మహత్యకు పాల్పడటం వైసీపీ నేతల భూ కబ్జాలకు పరాకాష్ట అని ఆమె ఆరోపించారు. ప్రత్తిపాడుకు చెందిన వైసీపీ నాయకులు మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు చలంకూరి భాను, జొన్నాపల్లి మురళి, మరికొందరు టీడీపీలోకి చేరారు. వారికి సత్యప్రభ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టి.రాయవరం గ్రామంలో పిడుగుపాటుకు గురైన మహేష్ కుటుంబాన్ని సత్యప్రభ పరామర్శించి సానుభూతి తెలిపారు. టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ళ జగదీష్, మూరా వరప్రసాద్, పత్రి రమణ, కంచుమర్తి రాఘవ, సైతిన శ్రీను, సర్పంచ్ తటవర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

'పేదలకు అండగా సంక్షేమ పథకాలు'

కాకినాడ సిటీ, మార్చి 25: దేశ చరిత్రలోనే పేదలకు అండగా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిందని పీసీసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ తెలిపారు. కాకినాడ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం పార్టీ బీఎల్ఏల నియామకంపై జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను విడుదల చేశారు. సమావేశానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పద్మశ్రీ మాట్లాడారు. ఏఐసీసీ కో ఆర్డినేటర్ బీఆర్‌కే నాయుడు, ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా శివప్రసాద్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకటరమణ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు కోలా ప్రసాద వర్మ, మారోతి శివగణేష్, పెద్దాడ సుబ్బారాయుడు, తుమ్మల దొరబాబు, పులగల రాజు, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు, పోలిశెట్టి శ్రీనివాసు,తుమ్మలపల్లి వాసు ఉన్నారు.



కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న నాయకులు

పేద విద్యార్థులకు సహకారం అందిస్తాం

మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మార్చి 25: పేద విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవసరమైన సహకారం అందించాలన్నదే తమ లక్ష్యమని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. వర్మాస్ కావ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏర్పాటు చేసిన ఉచిత ఎమ్‌సెట్ కోచింగ్‌ను వర్మ, ఆయన తనయుడు గిరీష్ సోమవారం ప్రారంభించారు. అనువజ్ఞులైన ఉపాధ్యాయులతో శిక్షణతో పాటు ఉచితంగా మెటీరియల్‌ను అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని ప్రతి విద్యార్థి అర్థం చేసుకుని కష్టపడి చదివి వారి కలలు నెరవేర్చాలన్నారు. కోచింగ్ ఇన్‌చార్జి మాగాపు సూర్యమోహన్, కోఆర్డినేటర్ సుంకర అనిల్‌చౌదరి, అధ్యాపకులు దైవం, కృష్ణవేణి, సురేష్, స్వరూప, శ్రీనివాసరెడ్డి, సత్యశ్రీ, రమేష్, నాగేశ్వరరావు, వేణుగోపాల్,టీడీపీ నాయకులున్నారు.



వర్మను సత్కరించిన ఉదయ్‌శ్రీనివాస్

నిధులను దారి మళ్లించారు

పిఠాపురం, మార్చి 25: బీసీల సంక్షేమానికి సంబంధించిన సబ్‌ప్లాన్, కార్పొరేషన్ నిధులను సీఎం జగన్ దారిమళ్లించి దుర్వినియోగం చేశారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ 10 పరిధి జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జగన్ పాలనలో యువతను చిదిమివేస్తున్నారని, ఉపాధి కల్పించాల్సింది పోయి ఉన్న ఉద్యోగాలు పోగొడుతున్నారని విమర్శించారు. డ్రగ్స్, గంజాయి రవాణాలో ఏపీ నెంబర్ వన్‌గా ఉందన్నారు. విశాఖను రాష్ట్ర రాజధానిగా చేస్తానని చెప్పి డ్రగ్స్ రాజధానికి మార్చివేశారని ఎద్దేవా చేశారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్మను కలిసిన ఉదయ్‌శ్రీనివాస్

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మను కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ కలిశారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో వర్మ, ఇతర టీడీపీ నాయకులను కలిసి టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా ఎంపీగా పోటీ చేస్తున్న తనకు మద్దతు ఇవ్వాలని ఉదయ్ శ్రీనివాస్ కోరారు. వర్మను శాలువాతో సత్కరించారు. చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా జనసేన అభ్యర్థుల విజయం కోసం పనిచేస్తామని వర్మ తెలిపారు. టీడీపీ,జనసేన నేతలు ఉన్నారు.

జాతీయ రహదారిపై విస్తృతంగా వాహన తనిఖీలు



గొల్లప్రోలు: తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

గొల్లప్రోలు, మార్చి 25: జాతీయ రహదారులపై అధికారులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో పాటు పోలీసు అధికారులు గొల్లప్రోలు టోల్‌ప్లాజా, చెందుర్తి, తాటిపర్తి జంక్షన్లు, గొల్లప్రోలు, చేబ్రోలు బైపాస్‌రోడ్డుల్లో బస్సులు, కార్లు, ఇతర వాహనాలను ఆపి తనిఖీ చేశారు. అలాగే కొన్ని వాహనాల రికార్డులను, బస్సుల్లో లగేజీలను పరిశీలించారు. తనిఖీల్లో గొల్లప్రోలు ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు హైవేపై...

ప్రత్తిపాడు, మార్చి 25: ప్రత్తిపాడు - ధర్మవరం వద్ద రాచపల్లి అడ్డురోడ్డు వద్ద సోమవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి నగదు, ఇతర సామాగ్రి రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ శేఖర్ బాబు, ఎస్‌ఐ ఎం.పవన్‌కుమార్ హెచ్చరించారు. అడ్డురోడ్డు సెంటర్‌లో రాజమండ్రి నుంచి విశాఖ వైపు వెళ్తున్న వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు.



రాచపల్లి అడ్డురోడ్డు వద్ద తనిఖీలు

హోలీ వేడుకలు



సర్పవరం జంక్షన్: హోలీ వేడుకల్లో యువత

సర్పవరం జంక్షన్, మార్చి 25: కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో యువకులు హోలీ వేడుకల్లో రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. సోమవారం సర్పవరం జంక్షన్ వద్ద గల ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు తరలివచ్చారు. ఒంటికి రంగులు పూసుకుని ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. తీన్‌మార్, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో స్టెప్పులేస్తూ ఆనందోత్సాహాల నడుమ వేడుకలు నిర్వహించారు.

పోర్టుసిటీ (కాకినాడ): నగరంలో మెయిన్‌రోడ్, దేవాలయం వీధి, వెంకట్‌నగర్, బాలాజీచెరువు తదితర ప్రాంతాల్లో యువకులు ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ హోలీ చేసుకున్నారు. జైన్ మందిరం, జైన్ అన్నదాన సత్రం తదితర ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో మహిళలు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో చిన్నారులు కేరింతలు కొడుతూ పరుగులు తీస్తూ రంగు రంగు నీళ్ల జల్లుకున్నారు. ఒకరికి ఒకరు శుభాకాంక్షలు చెప్పుకుని ఆనందనంగా గడిపారు.

కరప: మండల గ్రామాల్లో చిన్నారులు, యువకులు రంగులు పూసుకుని, ఒకరిపై ఒకరు రంగు నీళ్ల జల్లుకున్నారు. ప్రధానరహదారులు, వీధుల్లో తిరుగుతూ ఆట పట్టించారు.

జగ్గంపేట: జగ్గంపేటలో రాజస్థాన్ మార్వాడిలతో పాటు ఆర్యవైశ్య విద్యార్థులు ఘనంగా హోలీ నిర్వహించారు. ఒకరికొకరు ముఖానికి రంగులురాసుకుని శుభాకాంక్షలు చెప్పారు.

ప్రత్తిపాడు: మండల గ్రామాల్లో యువకులు, విద్యార్థులు రంగులు జల్లుతూ కేరింతలు చేశారు. పలుచోట్ల రంగునీళ్ళు చల్లుకుతూ యువత హోలీ సంబరంలో మునిగి తేలారు.

వైభవంగా చక్రస్నానం



చక్రస్నానం నిర్వహిస్తున్న వేదపండితులు

పిఠాపురం, మార్చి 25: తిరుమల తిరుపతి దేవస్థానంలో పిఠాపురంలో ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం చక్రస్నానం నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, తోమాలసేవ, చతుస్థానార్చన నిర్వహించారు. వృషభ లగ్నంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేదపండితులు చక్రస్నానం చేయించారు. సాయంత్రం ధ్వజావరోహణం, పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, విద్వత్‌సంభావన జరిగాయి. పూజాది కార్యక్రమాలను ఆలయ వేద పండితులు రామకృష్ణాచార్యులు, నరసింహాచార్యులు నిర్వహించగా, టీటీడీ డిప్యూటీ ఈవో వెంకటయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాలస్వామికి చక్రస్నానం

ప్రత్తిపాడు, మార్చి 25: మండలంలోని ధర్మవరంలో రుక్మిణి సత్యప్రభ సమేత రాజగోపాలస్వామికి సోమవారం చక్రస్నానం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. అలాగే స్వామి, అమ్మవార్లకు పూర్ణాహుతి, వసంతి ఉత్సవాలు చేపట్టారు. అర్చకులు నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.

అయ్యప్పస్వామికి అభిషేకాలు



అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, మార్చి 25: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో హరిసుత అయ్యప్పస్వామికి స్వామి జన్మనక్షత్రం ఉత్తర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు చేశారు. మహాన్యాస పారాయణ చేసి ఆవుపాలు, నెయ్యి, పెరుగు, తేనె, పంచదార, చెరుకురసం, పళ్లరసాలు, గంధం, భస్మాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామిని నూతన వస్త్రంతో అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించగా, ఆలయ సేవాసంఘం సభ్యులు భక్తులకు మధుర పదార్థాలు, పెన్నులందించారు.

అయ్యప్పస్వామి జన్మనక్షత్ర పూజలు

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి 25: అయ్యప్పస్వామి జన్మనక్షత్ర పూజలు వైభవంగా జరిగాయి. సోమవారం భానుగుడి పోలీస్ రిజర్వులైన్‌లో గల అయ్యప్ప దేవాలయంలో నిర్వహించిన పూజలకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. విశేష గణపతి హోమం, ప్రాతఃకాల పూజ, గోపూజ, స్వామి వారికి విశేష అభిషేకాలు, సహస్ర నామార్చన, దీపారాధన, దీపోత్సవం, పుష్పాభిషేకం తదితర పూజలలో భక్తులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు

సామర్లకోట, మార్చి 25: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఆదివారం పౌర్ణమి మహాపర్వదినం సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న, శ్రీనివాసరావు, వినయ్ తదితరుల వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి పంచద్రవ్యాలతో అభిషేకపూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

కుక్కుటేశ్వర క్షేత్ర ప్రదక్షిణ

పిఠాపురం, మార్చి 25: పట్టణంలో పాదగయలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి క్షేత్ర ప్రదక్షిణ సోమవారం వైభవంగా జరిగింది. పౌర్ణమి సందర్భంగా కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం నుంచి హరహర శంకర, జయజయ శంకర నామస్మరణతో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను పల్లకీపై ఉంచి ప్రదక్షిణ గావించారు. ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, పతంజలి యోగా సమితి సభ్యులు ఉన్నారు.

అయోధ్య యాత్రికులకు సన్మానం

కోటనందూరు, మార్చి 25: ఆంధ్రప్రదేశ్ నుంచి అయోధ్యకు సైకిల్‌పై వెళ్లిన యువకులను కోటనందూరులో అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ, శివాలయం కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. మండలంలో బొద్దవరం గ్రామానికి చెందిన బుద్ధరాజు, బీమవరపుకోటకు చెందిన నిట్టల శ్రావణ్‌కుమార్, దొడ్డి ప్రసన్నకుమార్ 27రోజుల పాటు 1800 కిలోమీటర్లు సైకిళ్లపై యాత్ర చేయడంతో సన్మానించారు. రాముని ఆశీస్సులతోనే ఎటువంటి ఆటంకం లేకుండా అయోధ్యకు చేరి స్వామి దర్శించుకున్నామని యువకులు చెప్పారు.



అయోధ్య వెళ్లిన యువకులను సన్మానిస్తున్న దృశ్యం